గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు: పాలడుగులో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు, జనవరి 28 : గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని పాలడుగులో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల మౌలిక వసతులను కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. గ్రామాల్లో మిగిలిన వీధులన్నింటిని సీసీ రోడ్లుగా మార్చడం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు పార్టీలకతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, తాసీల్దార్ రాంప్రసాద్, సర్పంచు మరిపెల్లి యాదయ్య,ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణచారి, పంచాయతీ కార్యదర్శి శోభన్‌బాబు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు సోమిరెడ్డి, ఉపసర్పంచు భగవంతు పాల్గొన్నారు.

ధర్మారంలో క్రీడామైదానం ప్రారంభం

అడ్డగూడూరు : మండలంలోని ధర్మారం గ్రామంలో రూ.3లక్షలతో నిర్మించిన క్రీడా మైదానాన్ని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే శారీరకంగా ధృడంగా ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ శీలం జ్యోతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య యాదవ్, లక్ష్మణాచారి, కత్తుల నరేశ్, దాసరి భిక్షం పాల్గొన్నారు.

మారోజు వీరన్న జయంత్యుత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తిరుమలగిరిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

తిరుమలగిరి, జనవరి 28 : మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఈనెల 31 జరిగే మాలోజు వీరన్న జయంతి ఉత్సవాల పోస్టర్‌ను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమోజు రవీందర్, మారోజు సోమాచారి, పూసోజు సోమాచారి, దీన్‌దయాళ్, యెల్సోజు ఉప్పలయ్య, యెల్సోజు నరేశ్, ఏమోజు మధు, అడ్డబొట్టు చారి, యెల్సోజు నాని పాల్గొన్నారు.

జయంతి సభను విజయవంతం చేయాలి

తుంగతుర్తి : జనవరి 31న సూర్యాపేటలో నిర్వహించనున్న కామ్రేడ్ మారోజు వీరన్న 62వ జయంతి సభను విజయవంతం చేయాలని సీపీయుఎస్ఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న కోరారు. సూర్యాపేట పబ్లిక్‌క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి పగడాల కోదండబా, అధ్యక్షుడు మట్టపల్లి లింగయ్య పలువురు వక్తలు పాల్గొనునన్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం .. మోత్కూరు యువకుడు మృతి

బోడ మల్లేశ్(ఫైల్)

మోత్కూరు, జనవరి 28: ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోత్కూరు పట్టణానికి బోడ మల్లేశ్ (25) మృతి చెందారు. పట్టణానికి చెందిన బోడ మల్లేశ్ కొంత కాలంగా నాగార్జునసాగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మల్లేశ్ స్నేహితుడు మణికంఠతో కలిసి మాచర్లకు వెళ్లి బైక్‌పై వస్తుండగా మాచర్ల మండలం బైరవునిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడే ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

5న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

- విప్ ఉల్లంఘించిన వారిపై చర్యలు శూన్యం
- వారంలో చర్యలన్న అదనపు కలెక్టర్ మాటలు ఉట్టిదేనా?

నీలగిరి, జనవరి 28 : నల్లగొండ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఫిబ్రవరి 5న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 8న బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే. అదేరోజు వైస్ చైర్మన్‌గా ఉన్న అబ్బగోని రమేశ్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తూ అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంతో ఆ పార్టీకి చెందిన చైర్మన్ సైదిరెడ్డి తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది. అవిశ్వాసం నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లకు ఆ పార్టీ విప్ జారీ చేసింది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన వారిపై చర్యలు తీసుకునేలా అప్పటికే విప్ జారీ చేసి సంబంధిత కాపీలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అవిశ్వాసంలో మొత్తం 15 మంది బీఆర్ఎస్ సభ్యులు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఓటింగ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్వర్యంలో వీడియోలో సైతం రికార్డు చేశారు. అవిశ్వాసం నెగ్గిన తరువాత వారం రోజుల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పిస్తామని మీడియా ద్వారా చెప్పారు. కానీ.. విప్ ఉల్లంఘించిన వారిపై ఏ నిర్ణయమూ తీసుకోకుండానే కొత్త చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

విప్ ఉల్లంఘనపై చర్యలు ఉట్టిదేనా..?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల విధానంలో పటిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయి. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లి పార్టీ నిర్ణయాలకు అతీతంగా వ్యవహరించిన వారి పదవి కోల్పోయేలా చట్టాలు రూపొందించారు. ఈ మేరకు నల్లగొండ నియోజకవర్గంలో గతంలో పగిడిమర్రి, రేగట్టె ఎంపీటీసీలు పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొంటే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వారిపై వెంటనే అనర్హత వేటు వేసి తిరిగి ఎన్నికలు నిర్వహించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక మున్సిపాలిటీల్లో చైర్మన్‌పై అవిశ్వాసాలు ప్రకటించారు. కొన్ని చోట్ల వీగిపోయినా.. నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ సందర్భంగా విప్ ఉల్లంఘించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

దీన్ని పక్కన పెట్టి చైర్మన్ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా యంత్రాంగం సిఫార్స్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగమే ఇలా ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడం ఏమిటని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.

పెదవీడు లిఫ్ట్ వద్ద కాపర్ వైర్ చోరీ

మఠంపల్లి, జనవరి 28 : మండలంలోని రామచంద్రాపురం సమీపంలో గల కృష్ణానదిపై ఏర్పాటు చేసిన పెదవీడు లిఫ్ట్ మోటార్ కాపర్ వైరు చోరీకి గురైంది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మఠంపల్లి ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పెదవీడు లిఫ్ట్ వద్ద ఉన్న మోటర్ కాపర్ వైరు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని లిఫ్ట్ చైర్మన్ అన్నెం నర్సిరెడ్డి ఈనెల 25న ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసుకుని విచారణ చేయగా గరిడేపల్లి మండలం కొండయ్యగూడేనికి చెందిన మాతంగి సురేశ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించామని, ఆయనపై కేసు నమోదు చేసి మరికొందరు అనుమానితులను విచారిస్తున్నట్లు తెలిపారు. రూ.లక్ష విలువ గల 50 మీటర్ల వైరు చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలింది.

పంచాయతీల్లో ప్రత్యేక పాలన

- ఈనెల 31తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- అవసరమైన చర్యలు తీసుకుంటున్న యంత్రాంగం
- ప్రత్యేకాధికారుల వివరాలు సేకరణ

నేరేడుచర్ల మండలం రోళ్లవారిగూడెం గ్రామ పంచాయతీ భవనం

నేరేడుచర్ల, జనవరి 28 : గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ఈనెల 31తో ముగియనుంది. దాంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. జిల్లాలో 23 మండలాలలోని 475 గ్రామ పంచాయతీల్లో 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. వారి పదవీకాలం ఈనెల 31తో ముగియనుండగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనున్నది. ఈ మేరకు జిల్లా అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక అధికారులను నియమించడానికి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. పంచాయతీ పాలనకు పదవీకాలాన్నీ పొడిగిస్తూ పర్సన్ ఇన్‌చార్జిలుగా అవకాశం ఇవ్వాలని సర్పంచులు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం కనిపించలేదు.

అభివృద్ధి పథంలో పల్లెలు

బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చింది. గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేసింది. క్రమం తప్పకుండా నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించింది. పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు, విద్య, వైద్యం, రవాణా, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. పల్లెల్లో రోడ్లు మురుగు కాల్వల నిర్మాణం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ భవనాలు, రైతు వేదికల నిర్మాణాలు చేపట్టింది. ఫలితంగా పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక అధికారులు వీరే..

మండలంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తారు. తాసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఎంఈఓ, వ్యవసాయాధికారి, పశు వైద్యాధికారులు, వివిధ శాఖల్లో పని చేసే ఇంజినీర్లు, ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు, హార్టికల్చర్ ఏఓలు, డిప్యూటీ తాసీల్దార్లు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్, రికార్డ్ అసిస్టెంట్లు, ఏఈఓలను నియమించనున్నారు.

'పట్టభద్రులకు అవగాహన కల్పించాలి'

పార్టీ మండల కార్యాలయంలో మాట్లాడుతున్న రజాక్

మద్దిరాల, జనవరి 28 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎస్ఏ రజాక్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల కోసం డిగ్రీ పూర్తి చేసిన బీఆర్ఎస్ పార్టీ సానుభూతిపరులకు ఓటు నమోదు చేయించాలని సూచించారు. అదేవిధంగా బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు తెలిపే విధంగా దిశానిర్దేశం చేయాలని సూచించడం జరిగింది. సమావేశంలో వైస్ ఎంపీపీ బెజ్జెంకి శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు, రావుల వెంకన్న, వడ్డాణం మధుసూదన్, తీగల వెంకన్న, శిరంశెట్టి వెంకన్న, లావుడ్య వెంకన్న, బద్దం సంజీవరెడ్డి, సూరారపు రాజు, బొబ్బిలి ఉప్పలయ్య, మల్యాల నర్సయ్య, బీఎస్ ముదిరాజ్ ఉన్నారు.

సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

పేద విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న సీతరామయ్య

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికె పూడి గాంధీ

కోదాడ రూరల్, జనవరి 28 : సమాజసేవలో కమ్మవారు భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. హైదరాబాద్ లో అమీర్‌పేట్ రాష్ట్ర కమ్మసేవా సంఘం కార్యాలయంలో ఆదివారం నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కమ్మసేవా సమితి కోదాడ పట్టణాధ్యక్షుడు పెదనాటి వెంకటేశ్వరావు, సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య పాల్గొని పేద విద్యార్థులకు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో సురేశ్, రంగారావు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

నూతనకల్ ; జనవరి 28: త్వరలో జరగబోవు ఎమ్మెల్సీ (పట్టభద్రుల నియోజకవర్గం) ఎన్నిక కోసం పట్ట భద్రులంతా ఫిబ్రవరి 6 వరకు ఓటు నమోదు చేసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న పట్ట భద్రులు కూడా కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2020 నవంబర్ 1 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులని ఆయన తెలిపారు. ఓటు నమోదుకు ఫారం-18 పూర్తి చేసి డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్ సెట్‌తో నేరుగా తాసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకన్న

సూర్యాపేట రూరల్, జనవరి 28 : సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా రణపంగ వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా ఆర్. దుర్గాప్రసాద్, జనరల్ సెక్రెటరీగా పొడిసెట్టి నర్సయ్య, ట్రెజరర్ పబ్బతి లక్ష్మి, సహాయ కార్యదర్శిగా శ్రీరాముల చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

బెదిరించి డబ్బు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

అడ్డగూడూరు, జనవరి 28: మండల కేంద్రంలోని బీఎల్ఎన్ఎస్ వైన్స్‌లో పనిచేసే సాయి అనే వ్యక్తిని మండల కేంద్రానికి చెందిన పరమేశ్ బెదిరించి రూ.75 వేలు వసూలు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే దుకాణం ఎలా నడుస్తుందో చూస్తా అని బెదిరించడంతో రూ.75 వేలు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేశారు. సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రచ్చ బండ నిర్మాణ పనులు ప్రారంభం

మోత్కూరు : పాటిమట్లలో రచ్చ బండ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ మల్లేశ్

మోత్కూరు, జనవరి 28 : మండలంలోని పాటిమట్లలో యూత్ కమిటీ ఆధ్వర్యంలో రచ్చ బండ నిర్మాణ పనులను సర్పంచ్ దండెబోయిన మల్లేశ్ ఆదివారం ప్రారంభించారు. స్థానిక మసీదు వద్ద ఉన్న వేప చుట్టూ గ్రామస్తులు కుర్చోవడానికి అనువుగా ఉండేలా దాతల సహకారంతో రచ్చ బండ గద్దెను నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచు కొత్తోజు కృష్ణ, నాయకులు రాచకొండ బాలరాజు, చిరుమర్తి యాదయ్య, గుండా రాములు, పోషబోయిన యాదయ్య, ప్రేమ్‌చంద్, అనిల్, నరేశ్ పాల్గొన్నారు.

సూర్యాపేట వాసికి సేవారత్న అవార్డు

సినీ గాయకుడు ఆర్పీ పట్నాయక్ చేతుల మీదుగా సేవారత్న అవార్డు అందుకుంటున్న నజీర్‌బాబా

బొడ్రాయిబజార్, జనవరి 28 : జిల్లా కేంద్రానికి చెందిన బ్లడ్ సోల్జర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నజీర్ బాబా సేవారత్న అవార్డు అందుకున్నారు. జనయిత్రీ ఫౌండేషన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మిర్యాలగూడలో జరిగిన కార్యక్రమంలో నజీర్‌బాబా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి వరల్డ్ రికార్డ్ అండ్ బ్లడ్ డోనర్ సంపత్ కుమార్, సినీ గాయకుడు ఆర్‌పీ పట్నాయక్ చేతుల మీదుగా సేవరత్న అవార్డును అందజేశారు. నజీర్‌బాబాకు సేవారత్న అవార్డు రావడంతో సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

నేరేడుచర్ల, జనవరి 28: నేరేడుచర్ల మండలం సోమారం జడ్పీ ఉన్నత పాఠశాలకు 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ. 15 వేల విలువగల మైక్ సెట్‌ను ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు దోరెపల్లి రవి, మహ్మద్ మోయిజ్, విజయ్, పవన్‌కుమార్, జానకిరాములు, రహీమ్, సోమయ్య, కిరణ్, వెంకన్న, పాండు ఉన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నూతనకల్, జనవరి 28 : మండల కేంద్రంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తీగల కరుణాశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. గ్రామంలో ఆదివారం ఎస్సీ కాలనీ, ప్రధాన వీధుల్లో దోమల మందును పంచాయతీ సిబ్బందితో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత వల్లే దోమలు వృద్ధి చెందుతాయని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండడానికి పూల కుండీలు, పాత టైర్లు, సిమెంట్ ట్యాంకులు, డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కారోబార్ శంభయ్య, జీపీ స్బిబంది తదితరులు ఉన్నారు.

అధ్వానంగా మేళ్లచెర్వు-చింతలపాలెం డైవర్షన్ రోడ్డు

గతుకుల రోడ్డుపై లారీ వెళ్తుండగా ఎగసిపడుతున్న దుమ్ము

మేళ్లచెర్వు, జనవరి 28 : మేళ్లచెర్వు నుంచి చింతలపాలెం వెళ్లే దారిలో రైల్వే ట్రాక్ పక్కన ఉన్న డైవర్షన్ రోడ్డు అధ్వానంగా ఉన్నది. ఈ దారిలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల వల్ల తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే బ్రిడ్జి పనులు ఏడేండ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. తాత్కాలిక రోడ్డు మీదుగా చింతలపాలెం మండలానికి వెళ్లే వాహనాలతో పాటు పొలాలకు వెళ్లే రైతులు ప్రయాణం సాగిస్తున్నారు. ఈ సమయంలో దుమ్ము బాగా లేచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు గుంతలలో నీరు నిలిచి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

75వ గణతంత్ర వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న యూత్ అధ్యక్షుడు సతీశ్

పాలకవీడు, జనవరి 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గణతంత్ర వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని యూత్ అధ్యక్షుడు పెరుమళ్ల సతీశ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 75 గణతంత్ర దినోత్సవాన్ని వజ్రోత్సవాలు అని పేరు పెట్టి సాదాసీదాగా నిర్వహించడం బాధాకారం అన్నారు. భారత రాజ్యాంగం గురించి ప్రజలందరికీ తెలిసేలా ఉత్సవాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో నాగయ్య, కరుణాకర్, సైదులు, వినోద్, నర్సింహ, సాయిబాబా పాల్గొన్నారు.

శివ మాలధారులకు అన్నదానం

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శివమాలధారులు

బొడ్రాయిబజార్, జనవరి 28 : జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో శివ దీక్షా స్వాముల నిత్యాన్నదానం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం శివస్వాములకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన వితరణ చేశారు.కార్యక్రమంలో రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రధానార్చకుడు రెంటాల సతీశ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వామి కోనయల్లయ్య, చింతల లింగరాజు, సురకంటి మధుసూదన్‌రెడ్డి, రాజేశ్, ఉపేందర్, సైదులు, రవితేజ పాల్గొన్నారు

రేషన్ డీలర్ల సంఘం మద్దిరాల అధ్యక్ష, కార్యదర్శుల నియామకం



మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలర్లు

మద్దిరాల, జనవరి 28: మండల రేషన్ డీలర్లు సమావేశం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల రేషన్ డీలర్ల అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపల్లి సంధ్య, కార్యదర్శిగా దుగ్యాల వెంకటేశ్వర్‌రావును నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కమిటీల ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న పద్మశాలీ సంఘం నాయకులు

మేళ్లచెర్వు, జనవరి 28 : పద్మశాలీ సంఘం మండల, గ్రామ కమిటీలను ఆదివారం సాయంత్రం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి శ్రీనివాసు, గ్రామ శాఖ అధ్యక్షుడిగా అవ్వారు రాజు, ప్రధాన కార్యదర్శిగా దామెర్ల రామారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కొండలు, వీరబాబు, వెంకటప్పయ్య, శివ, రమేశ్, గోపి పాల్గొన్నారు.

గడ్డిపల్లి ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధాకర్ సస్పెన్షన్

గరిడేపల్లి, జనవరి 28 : మండలంలోని గడ్డిపల్లి గ్రామ ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్ పాఠశాలలోని విద్యార్థినిలతో దురుసు ప్రవర్తన, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఈఓ అశోక్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆయన స్థానంలో మునగాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సాయి ఈశ్వరికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే సుధాకర్‌పై ఇటీవల పలు ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోదాడ రూరల్, జనవరి 28 : కోదాడ పట్టణానికి చెందిన భారతీ విద్యామందిర్ 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు